క్లుప్తంగా

వెంకటేశ్వరరెడ్డి భౌతికకాయానికి దద్దాల నివాళి



భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న దద్దాల, నేతలు

కనిగిరిరూరల్: మండల పరిధిలోని చల్లగిరిగిల్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మిట్టా వెంకటేశ్వర్రెడ్డి(47) భౌతికకాయాన్ని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంకటేశ్వరరెడ్డి మృతి పార్టీకి తీరని లోటన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, నాయకులు మిట్టా రమేష్రెడ్డి, గాండ్లపర్తి ఆది నారాయణరెడ్డి, యక్కంటి శ్రీనివాసులరెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, బత్తుల మాలీ, సంగటి మహేంద్రారెడ్డి, పలుకూరి భాస్కర్, మార్తాల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వెంకటమ్మ మృతి పార్టీకి తీరని లోటు



వెంకటమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

పామూరు: వైఎస్సార్సీపీ సీనియర్ నాయకురాలు, దొడ్డ వెంకటపల్లి గ్రామానికి చెందిన గడ్డి వెంకటమ్మ(70) సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. మంగళవారం మృతురాలి నివాసానికి వెళ్లిన పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్రెడ్డి, నేతలు వెంకటమ్మ భౌతిక కాయానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులు గడ్డి వెంకటనరసయ్యతో పాటు పలువురిని పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గట్లా విజయ భాస్కర్రెడ్డి, జొన్నలగడ్డ గోవిందయ్య, గడ్డి చిన తిరుపతయ్య, పెద తిరుపతయ్య, వెంకటేశ్వర్లు, కోటపాటి మాలకొండయ్య ఉన్నారు.

తైక్వాండోలో కారుమంచి యువత సత్తా



పతకాలు సాధించిన మేడికొండ మణికంఠం, శివరామకృష్ణ

టంగుటూరు: తైక్వాండోలో కారుమంచి యువకులు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో విజయకేతనం ఎగురవేశారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని సీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించిన 2025 ఫస్ట్ ఏషియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ తైక్వాండో ఛాంపియన్షిప్ పోటీల్లో ప్రతిభ చాటారు. పోటీల్లో టంగుటూరు మండలం కారుమంచికి చెందిన మేడికొండ మణికంఠం బంగారు పతకం, గాలి శివరామకృష్ణ రజిత పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారిని అభినందించారు.

కార్పొరేటర్లకు దోచిపెడుతున్న ప్రభుత్వాలు

కనిగిరిరూరల్: ప్రభుత్వాలు ప్రకృతి వనరులను కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతున్నారని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక మాంటిస్సోరి హై స్కూల్లో మంగళవారం ఓజోన్ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఓజోన్ పొర మందం తగ్గడానికి కారణం క్లోరో, ఫ్లోరో కార్బన్లు అని తెలిపారు. ప్రకృతి వనరులను విపరీతంగా దోచేస్తున్నారని, అభివృద్ధి పేరితో ఇసుక, మట్టి తోడేస్తున్నారని, అడవులను నరికేస్తున్నారన్నారు. కరస్పాండెంట్ ఎస్ పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

336 బేళ్లు తిరస్కరణ

కొండపి: స్థానిక వేలం కేంద్రానికి క్లస్టర్ పరిధిలోని గుర్రప్పడియా, కె.అగ్రహారం మూగచింతల, నెన్నూరుపాడు, చతుకుపాడు గ్రామాలకు చెందిన రైతులు 1174 బేళ్లను వేలానికి తీసుకురాగా 838 బేళ్లను కొనుగోలు చేసి 336 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.331, కనిష్ట ధర రూ.108, సరాసరి ధర రూ.228.52గా నమోదైంది. 21 కంపెనీలు పాల్గొన్నాయి.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో జరిగిన వేలంలో పొగాకు అత్యధిక ధర కేజీ రూ.331 పలికింది. పొందూరు క్లస్టర్ గ్రామాలకు చెందిన రైతులు 1040 బేళ్లను తీసుకురాగా 891 బేళ్లను కొనుగోలు చేసి 149 బేళ్లను తిరస్కరించారు. కనిష్ట ధర రూ.110, వేలంలో 43 కంపెనీలు పాల్గొన్నాయి.

వాహనదారులకు లైసెన్స్ తప్పనిసరి

కొండపి: వాహనదారులు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని ఎస్సై ప్రేమ్కుమార్ అన్నారు. స్థానిక అనకర్లపూడి రోడ్డులో మంగళవారం ద్విచక్రవాహనాలను తనిఖీ చేశారు. మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. అనంతరం వాహనాలను తనిఖీ చేసి జరిమానా విధించారు. ఏఎస్సై అంకారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈసారైనా వస్తారా..?

- మండల సమావేశాలకు అధికారులు డుమ్మా
- కూటమి ప్రభుత్వంలో 5 సమావేశాల్లోనూ ఇదే తంతు
- సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పేవారు కరువు
- టీ, బిస్కెట్లతో తూతూమంత్రంగా సమావేశాలు



కనిగిరి మండల పరిషత్ కార్యాలయం

కనిగిరిరూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మండల సర్వసభ్య సమావేశాలు మొక్కుబడిగా సాగుతున్నాయి. మండలస్థాయిలో ఉన్న సమస్యలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునేందుకు ప్రతి నెలకు లేదా మూడు నెలలకు ఒకసారి మండల సమావేశాలు నిర్వహిస్తుంటారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 15 నెలల కాలంలో ఐదుకు పైగా మండల సమావేశాలు జరిగాయి. అయితే ఈ సమావేశాలకు అధికారులు హాజరైంది నామమాత్రంగానే.

కీలక అధికారు డుమ్మా..

మండల సమావేశాలకు 25 పంచాయతీల సర్పంచ్లు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు హాజరవుతారు. వీరితో పాటు 24 శాఖలకు సంబంధించిన మండల స్థాయిలోని వివిధ శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉంది. కానీ వారు మండల సమావేశాలకు డుమ్మా కొడుతూ అధికార పార్టీనేతలకు జీ హుజూర్ అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో సభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పవాళ్లు లేక సభ్యులు కూడా ఢీలా పడుతున్నారు. కనీసం కూటమి సర్కార్ లో ఏ పథకాలు అమలు, వైఫల్యాలపై చర్చలు కూడా జరిగే పరిస్థితి ఇప్పటి వరకు కన్పించలేదు. ఎంపీటీసీల, సర్పంచ్ల పదవీ కాలం ముగియనుంది.. కనీసం ఈ సారైనా అధికారులు హాజరవుతారా అనేది వేచి చూడాల్సి ఉంది.

కనీసం వేతనాలు ఏవి..

ఎంపీటీసీ సభ్యులకు కూటమి సర్కార్ వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు కనీసం గౌరవ వేతనాలు ఇవ్వని పరిస్థితి. దాదాపు ఏడాదిన్నర కాలంకు పైగా ఎంపీటీసీ సభ్యులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన గౌరవ వేతన జీతాలు ఇవ్వలేదని సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 8 నెలలకు బిల్లులు పెట్టామని ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేసిందని, కానీ నిధులు జమ చేయాల్సి ఉందని అధికారులు చెప్తున్నారు.

ఆర్థిక సంఘం నిధులు ఏవి..

పల్లెసీమల అభివృద్ధికి, గ్రామాల్లో తక్షణ చర్యల కార్యక్రమాల నిర్వహణకు, వివిధ రకాల అభివృద్ధి పనులకు ప్రభుత్వాలు మంజూరు చేసే 15వ ఆర్థిక సంఘ రెండో విడత నిధులు విడుదల చేయలేదు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది.

రిజర్వాయర్లు, చెరువులు మరమ్మతులేవి..?

మండలంలో పునుగోడు, ఎన్గొల్లపల్లి రిజర్వాయర్లతో కలిపి 13 మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉండగా 100 ఎకరాలలోపు ఆయకట్టు ఉన్న చెరువులు 30 వరకు ఉన్నట్లు నివేదికలున్నాయి.

ఎస్ గోల్లపల్లి రిజర్వాయర్ మరమ్మతులకు రూ.46లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు, పునుగోడు రిజర్వాయర్ షట్టర్ మరమ్మతులకు రూ.3 లక్షల నిధులతో పనులకు చర్యలు తీసుకుంటున్నట్లు, మండలంలోని 30 చెరువుల మరమ్మత్తుకు రూ.12.70 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు చెప్తున్నా.. క్షేత్ర స్థాయిలో అనేక చెరువులు మరమ్మతులకు నోచుకోలేదు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో తుఫాను లాంటి విపత్తులు వస్తే పెను ప్రమాదాలు తప్పవు.

వేధిస్తున్న సమస్యలు

గ్రామాల్లో అనేక చోట్ల పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉంది. పలు గ్రామాల్లో వైరల్ జ్వరాలు ప్రబలి ప్రజలు పట్టణాలకు పరుగులు పెడుతున్నారు. వ్యవసాయ సీజన్ కావడంతో రైతులు విత్తనాలు, ఎరువుల మందుల కోసం ఎదురు చూస్తున్నారు. గ్రామీణ రోడ్లు ఛీద్రంగా మారి ప్రయాణానికి ఇక్కట్లు పడుతున్నారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఉచిత బస్సు అనేక గ్రామాల్లో తిరగడం లేదు. రోడ్డు ఉన్న గ్రామాలకు చాల చోట్ల బస్సులు తిరిగే పరిస్థితి లేక మహిళలు అనేక అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వంలో ఆరోగ్య సురక్ష పథకం ద్వార గ్రామాల్లోనే వైద్య శిబిరాలు నిర్వహించారు. వారంలో ఒక రోజు వివిధ రకాల వైద్యులు వచ్చి అక్కడే పరీక్షలు చేసి అవసరమైన మందులు ఇచ్చేవారు. అవసరమైన వారికి మాత్రమే పట్టణ పెద్ద ఆస్పత్రిలకు రిఫర్ చేసేవారు. కూటమి సర్కార్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు అమలుకు నోచుకోవడం లేదు. ఇలా అనేక సమస్యలపై మాట్లాడేందుకు, ప్రశ్నించేందుకు ప్రాదేశిక సభ్యులు సిద్ధంగా ఉన్నా మండల స్థాయి అధికారులు మాత్రం సమావేశాలకు వచ్చే పరిస్థితి లేకపోవడం శోచనీయం.

క్రీడలతో మానసిక ఉల్లాసం



పీసీపల్లిలో పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓలు



క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు



హనుమంతునిపాడులో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

పీసీపల్లి: మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని ఎంఈఓలు సంజీవ్, శ్రీనివాసచారి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో స్కూల్ గేమ్స్ అండ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండలస్థాయి పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. 17 ఏళ్ల లోపు విభాగంలో వాలీబాల్ విన్నర్గా పెద్దచెర్లోపల్లి, 14 ఏళ్ల లోపు విభాగం వాలీబాల్లో పెద్దచెర్లోపల్లి జట్టు గెలుపొందాయని పీడీ పి.ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుబ్బరాయుడు, పోతులూరయ్య, నరసింహం, రమణయ్య, నరసింహారెడ్డి, కేజీబీవీ ఎస్ఓ సుజాత, వీరపనేని పెద్దన్నచౌదరి, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి క్రీడా పోటీలు మంగళవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. పోటీలను ఎంఈఓలు జి.పెద్దిరాజు, ఎస్ రమణయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. అండర్ 14, 17 విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ నరసింహారావు, మండలస్థాయి కోఆర్డినేటర్ షేక్ జిలానీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశుభ్రతే ఆరోగ్యానికి భద్రత



వాల్పోస్టర్లు ఆవిష్కరిస్తున్న చైర్మన్, కమిషనర్

కనిగిరిరూరల్: పరిశుభ్రతే ఆరోగ్యానికి భద్రత అని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పరిశుభ్రత మన ఆరోగ్యానికి భద్రత అనే కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ పిల్లి కృష్ణ మోహన్రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. శుభ్రతతోనే వ్యాధుల దూరమవుతాయన్నారు. కార్యక్రమంలో మేనేజర్ ఇనుపగుళ్ల ప్రసాద్రావు, శానిటరీ ఇన్స్పెక్టర్ ఎస్కే నాయబ్ రసూల్, గుడ్హెల్ప్ ఫౌండేషన్ చైర్మన్ మంద్రు రమేష్, మెప్మా సిబ్బంది రమణమ్మ, దీప్తి, హనీఫా, నవకుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ పొర సంరక్షణపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఉషారాణి

కనిగిరిరూరల్: ఓజోన్ పొర పరిరక్షణ, సంరక్షణపై విద్యార్థులు అవగాహన కల్గి ఉండాలని ప్రిన్సిపాల్ జె.ఉషారాణి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకో క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఓజోన్ పొర ప్రాముఖ్యతను వివరించారు. ఎకో క్లబ్ కో ఆర్డినేటర్ డి.జయకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి



స్టేషన్లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

హనుమంతునిపాడు: పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలని డీఎస్పీ ఈశ్వర్ యశ్వంత్ అన్నారు. స్థానిక పోలీస్స్టేషన్ను డీఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేసులకు సంబంధించిన ఫైల్స్, రికార్డులు, విధి నిర్వహణ రికార్డులు పరిశీలించారు. అనంతరం పెండింగ్ కేసులను విచారించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పోలీస్స్టేషన్ పరిసరాలు పరిశీలించారు. విధుల్లో ఉన్న సిబ్బంది పని తీరు, డ్యూటీల కేటాయింపు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కనిగిరి సీఐ షేక్ మీరావలి, ఎస్సై ఎం.మాధవరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు విధిగా టీకాలు వేయించాలి



పశువులను పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ జగత్ శ్రీనివాసులు

సింగరాయకొండ: పశువులకు వ్యాధులు సోకకుండా విధిగా టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జగత్ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని పాతసింగరాయకొండలో గాలి కుంటువ్యాధి టీకాల కార్యక్రమాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. డీడీ జగత్ శ్రీనివాసులు మాట్లాడుతూ టీకాలతో పశువులు ఆరోగ్యంగా ఉంటాయే తప్ప పాల దిగుబడి తగ్గదని వివరించారు. పశువులకు తప్పనిసరిగా గాలికుంటువ్యాధి టీకాలు వేయాలని సూచించారు. కొండపి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఏ రవికుమార్, డాక్టర్ ఎన్ హజరత్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నల్లబర్లీ పొగాకు సాగు నిషేధం



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి వెంకటేష్

మర్రిపూడి: మండలంలో రబీ సీజన్లో నల్లబర్లీ పొగాకు సాగు నిషేధించామని వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్ తెలిపారు. మండలంలోని చిలంకూరు, కాకర్ల గ్రామాల్లో మంగళవారం ఆయన రైతులతో సమీక్షా సమావేశం నిర్వహిచంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లబర్లీ పొగాకు ఏ ఒక్క రైతు సాగు చేయరాదని సూచించారు. రైతులు సాగుచేసి పంట పొలాలన్నీ ముందుగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. రైతులకు మద్దతు ధర, నష్టపరిహారం, ఇన్సూరెన్స్, సున్నావడ్డీ రాయితీ తదితర పథకాల అమలుకు ఈ పంట నమోదు తప్పనిసరన్నారు. రైతులు యూరియా వినియోగం తగ్గించాలన్నారు. విస్తరణాధికారి కోటేశ్వరరావు, వ్యవసాయ సహాయకులు వరప్రసాదు, శ్రీనివాసులు గ్రామ రైతులు పాల్గొన్నారు.

బోధనా నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి



శీలంవారిపల్లె జెడ్పీ హెచ్ఎస్లలో విద్యార్థులతో చర్చిస్తున్న ఎంఈఓ కొండారెడ్డి

సీఎస్పురం(పామూరు): పాఠశాలలకు అందించిన విద్యాసామగ్రిని వినియోగించి బోధనా నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలని ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. మండలంలోని సి.నాగులవరం, శీలంవారిపల్లె జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలను, ఆనికాలపల్లి, చింతపూడి ప్రాథమిక పాఠశాలలను మంగళవారం తనిఖీ చేశారు. క్లస్టర్ పరిధిలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు బోధనా కిట్లను పంపిణీ చేశామని, అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచడానికి ఈ కిట్లు ఎంతో ఉపయోగకరమన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టంగుటూరు: విద్యుత్ లైన్లో మరమ్మతులు నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి ఒంటి గంట వరకు 33 కేవీ విద్యుత్ లైన్లలో సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 33/11కేవీ సబ్స్టేషన్ రాయవారిపాలెం, పరిధిలోని గ్రామాలు, టంగుటూరు టౌన్, పసుపుకుదురు, రాయవారిపాలెం, 33/11 కేవీ సబ్ స్టేషన్ వెలగపూడి పరిధిలోని గ్రామాలు అనంతవరం, అలకురపాడు, వెలగపూడి , తాళ్లపాలెం గ్రామాల్లో సరఫరా నిలిపివేస్తామన్నారు. రైతులు సహకరించాలని కోరారు.

విద్యుత్ సబ్స్టేషన్ ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న విద్యుత్ జేఎల్ఎంలు, కాంట్రాక్ట్ కార్మికులు

సీఎస్పురం(పామూరు): గ్రేడ్–1 జేఎల్ఎంలను క్రమబద్ధీకరించి పెండింగ్లో ఉన్న కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలని జేఎల్ఎం, కాంట్రాక్ట్ కార్మికుల సంఘం నాయకులు జి.కృష్ణకుమార్, పి.మల్లయ్య డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారం కోరుతూ మంగళవారం స్థానిక విద్యుత్సబ్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1999 ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 2004 ఆగస్టు 31వ తేదీ వరకు మధ్య చేరిన ఉద్యోగులకు పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. దళారీ వ్యవస్థను రద్దు చేసి కాంట్రాక్ట్ కార్మికులకు నేరుగా వేతనాలు చెల్లించే విధానం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పి.నాగభూషణం, అరుణ్, రాంప్రసాద్, పుల్లయ్య, సుబ్బారావు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

ఆరాధన మహోత్సవాలు ప్రారంభం



పుష్పాభిషేకంలో శ్రీ శివరామ బ్రహ్మేంద్రస్వామి ఉత్సవమూర్తి

పామూరు: మండలంలోని అనుమునిగిరి శివరామ బ్రహ్మేంద్రస్వామి 130వ ఆరాధన మహోత్సవాలు మంగళవారం అనుమునిగిరి శివరామబ్రహ్మ క్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు రామడుగు శివరామదీక్షితులు ఉదయం స్వామికి సుప్రభాతసేవ, కలశతీర్థం, పూలాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో, విశ్వబ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో ఆలయ సమీపంలో మహా అన్నదానం నిర్వహించారు. ఆలయాన్ని ప్రత్యేక విద్యుద్దీపాలంకరణతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. విశ్వబ్రాహ్మణసంఘం నొస్సం నాగేంద్రాచారి, వి.ప్రసాదాచారి, శ్రీనివాసాచారి, దొరసానయ్యాచారి, భక్తులు పాల్గొన్నారు.

సాంకేతికత ఉపయోగిస్తే అవకతవకలకు చెక్



మాట్లాడుతున్న ఏపీడీ లక్ష్మారెడ్డి

కొండపి: సాంకేతికను ఉపయోగిస్తే అవకతవకలకు చెక్ పెట్టవచ్చని డీఆర్డీఏ ఏపీడీ లక్ష్మారెడ్డి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ బి.గోపీనాథ్ అధ్యక్షతన గ్రామ సంఘ సహాయకులకు సమీక్ష, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికతతో కొత్త యాప్ తీసుకువచ్చినందున సభ్యుల ఆర్థిక లావాదేవీలు ఆన్లైన్లో నమోదు చేయవచ్చన్నారు. దీని వల్ల సభ్యురాలి అప్పు రికవరీలు, నిల్వలపై పూర్తి అవగాహన ఏర్పడుతుందన్నారు. కొన్ని ప్రాంతాల్లో స్త్రీ నిధి, ఉన్నతి, సీఐఎఫ్ రుణాల రికవరీ చెల్లింపులో అవకవతవకలకు పాల్పడినందున రుణాలు మొండి బకాయిలుగా మారాయన్నారు. ఇకపై ఎవరైనా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏపీఎం గోపీనాథ్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం మండలానికి రూ.15 కోట్ల వరకు స్త్రీనిధి రుణాలు, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ రుణాలు రూ.కోటి, సామాజిక పెట్టుబడి రుణాలు మరో కోటి రూపాయలు సంఘ సభ్యులకు అందించి జీవనోపాధికి సహకారం అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సీసీలు మల్లికార్జున, వి.కృష్ణారెడ్డి, సీహెచ్ గోవిందమ్మ, రామాంజనేయులు, కె.రమణమ్మ, జి.కోటేశ్వరి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

పీసీపల్లి: ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న వారిని స్థానిక ఎమ్మార్సీలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాసచారి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయునిగా అవార్డు తీసుకున్న సంజీవ్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు అందుకున్న ఈశ్వరి భూషణ్ను, కేజీబీవీ ప్రిన్సిపాల్ సుజాతను, పాన్ ఇండియా బెస్ట్ టీచర్గా అవార్డు అందుకున్న స్వర్ణ రమణయ్యను ఘనంగా సన్మానించారు. మాజీ ఎంఈఓ మహంకాళి నరసింహారావు, సీఎస్పురం ఎంఈఓ రాజాల కొండారెడ్డి, శ్రీనివాసచారి, ఏసుబాబు, గురువారెడ్డి, విజయ్కుమార్, పోతులూరయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.20 వేల ఆర్థికసాయం



చెక్కు అందజేస్తున్న మానవత సభ్యులు, నాయకులు

పామూరు: మానవతా సంస్థ ద్వారా, దాతల సాయంతో మండలంలోని ముగ్గురు పేదలు, రోగులకు చికిత్స నిమిత్తం రూ.20 వేలు అందజేసినట్లు మానవత స్వచ్ఛంద సంస్థ మండల అధ్యక్షుడు వెండిదండి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక దివ్యజ్ఞాన సమాజంలో జరిగిన కార్యక్రమంలో కాకర్ల మాల్యాద్రికి సంస్థ ద్వారా రూ.5 వేలు, దాత వై.మాలకొండయ్య ద్వారా రూ.5 వేలు ఇచ్చామన్నారు. కనియంపాడుకు చెందిన కె.ప్రవీణ్కు రూ.5 వేలు, ఇనిమెర్లకు చెందిన పేదవిద్యార్థి గాలంకి బాలుకు రూ.5 వేలు ఆర్థికసాయం చేసినట్లు వారు తెలిపారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రుణాలు



మాట్లాడుతున్న అధికారులు

పొన్నలూరు: జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు బ్యాంకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఆ శాఖ అధికారులు థామ్సన్, సరస్వతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వర్క్షాపు నిర్వహించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో బ్యాంకుల అనుబంధంతో రుణాల పొందేందుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు కచ్చితంగా సంబంధిత అర్హత పత్రం ఉండాలన్నారు. ఎంపీడీఓ సుజాత, వెలుగు సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.